
ఓటేసేందుకు వస్తున్న కుటుంబం


హన్వాడలో పోలింగ్ కేంద్రం బయట నిల్చున్న మహిళలు


నంచర్లలో బారులు తీరిన ఓటర్లు


మహబూబ్‌నగర్ పట్టణంలో ఓటుహక్కు వినియోగించుకున్న ట్రాన్స్‌జెండర్లు

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- అక్కడక్కడ చెదురుమదురు ఘటనలు

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలో పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ సరళి సాయంత్రం 6 గంటల వరకు ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 23 గ్రామాల పరిధిలో దాదాపు 70 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు అంచనా వేశారు.

కోయిల్‌కొండ: మండలంలోని 44 పంచాయతీలలో 61 పోలింగ్‌బూత్‌లలో సోమవారం నిర్వహించిన పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 70శాతం పోలింగ్ నమోదైనట్లు తహ సీల్దార్ భరత్‌గౌడ్ తెలిపారు.

మహమ్మదాబాద్: మండల వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గాధిర్యాల్ మరికొన్ని గ్రామాల్లో దాదాపు 20 నిమిషాలపాటు ఈవీఎంలు ప్రారంభం కాకపోవడంతో ఎన్నికల సిబ్బందికి ఓటర్లకు కొంత ఇబ్బంది కలిగింది. మండల వ్యాప్తంగా 55శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రత్యేక అదనపు ఏఎస్పీ సుదర్శన్ గాధిర్యాల్, చౌదర్‌పల్లి, మహమ్మదాబాద్ ఎన్నికల కేంద్రాలను పరిశీలించారు. మహమ్మదాబాద్‌లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

జడ్చర్ల: నియోజకవర్గంలో దాదాపు 76 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. జడ్చర్ల అసెంబ్లీ పరిదిలో 25వేల మెజార్టీ సాధిస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు.

నవాబుపేటలో తగ్గిన పోలింగ్‌శాతం

నవాబుపేట: మండలంలో పోలింగ్ శాతం కాస్తా తగ్గింది. నాలుగు నెలల క్రితం అసెంబ్లీ ఎన్నికలలో 78.4 శాతం పోలింగ్ నమోదు కాగా తాజాగా పార్లమెంట్ ఎన్నికలలో 75.5 నమోదైంది. ఉదయం ఉధృతంగా సాగి మధ్యాహ్నం నుంచి తగ్గిపోయి డీలా పడింది.

బాలానగర్: మండలంలోని 21 పోలింగ్ కేంద్రాలలో 39 పోలింగ్ కేంద్రాల్లో 32,899 మంది ఓటర్లకు గాను 26,084 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 79 శాతం ఓట్లు పోలైనట్లు తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 81వ నంబర్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో అధికారులు మరో ఈవీఎంను ఏర్పాటు చేశారు. దీంతో అరగంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ మోహన్‌రావు, డీటీసీ డీఎస్పీ నర్సింహులు పరిశీలించారు.


ఓటేసిన గిరిజన మహిళలు


ఎదిరలో దీక్షలో కూర్చున్న గ్రామస్తులు


ఈవీఎం మిషన్లు సీల్ చేస్తున్న సిబ్బంది

కలెక్టర్, ఎస్పీల సందర్శన

జడ్చర్ల టౌన్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా కలెక్టర్, ఎన్నికల అధికారి రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్ మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. సెయింట్ ఆగ్నెస్ పాఠశాలలో ఉన్న కేంద్రాలతోపాటు మరికొన్ని కేంద్రాలను వారు సందర్శించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి మున్సిపాలిటి పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఓటేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



భూత్పూర్: మండలంలోని పోతులమడుగు, అమిస్తాపూర్‌లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం సాధారణ ఎన్నికల పరిశీలకుడు షేవాంగ్ గాయబో భూటియా పరిశీలించారు. ఈవీఎంల పనితీరు, ఓటింగ్ జరిగే విధానంతో పాటు వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్ రాజు ఉన్నారు.


జిల్లా కేంద్రంలోని బోయపల్లి రెవెన్యూ వార్డులో బారులుతీరిన ఓటర్లు


ఓటు హక్కును వినియోగించుకున్న మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ దంపతులు

75శాతం పోలింగ్ నమోదు

హన్వాడ: మండలంలో 48పోలింగ్ కేంద్రాల్లో 75శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. వీరిలో అత్యధికంగా మహిళలు ఓటేసేందుకు మునిమోక్షం, హన్వాడ, వేపూర్లో బారులు తీరారు. ముందురోజు అర్ధరాత్రి అక్కడక్కడ వర్షం కురవడంతో మరుసటిరోజు (సోమవారం) వాతావరణం చల్లబడింది.

మిడ్జిల్‌లో 80.52 శాతం

మిడ్జిల్: మండలంలో 80.52శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారి రాజునాయక్ తెలిపారు. మండలంలో మొత్తం 31 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ముగింది. బోయిన్‌పల్లిలో ఉదయం ఈవీఎం మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. వెలుగొమ్ములలో రాత్రి 7:40 వరకు పోలింగ్ కొనసాగింది.

రాజాపూర్: మండలంలో చొక్కంపేట్ మినహా అన్ని గ్రామాల్లో ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. ఈద్గాన్‌పల్లిలో ఉదయం 8గంటలకే పెద్ద సంఖ్యలో ఓటర్లు చేరుకున్నారు. మండలంలో 81.27శాతం పోలింగ్ నమోదైంది. చొక్కంపేట్‌లో మధ్యాహ్నం గ్రామానికి చెందిన ఓ మహిళ భర్త పేరు ఓటరులిస్టులో తప్పుగా ఉండటంతో ఏజెంట్లు అభ్యంతరం తెలిపారు. గ్రామంలో మాజీ ఎంపీటీసి లక్ష్మయ్య, ప్రస్తుత ఎంపీటీసీ అభిమన్యూరెడ్డి వర్గం ఘర్షణ పడ్డారు. వెంటనే పోలీసులు చేరుకుని చెదరగొట్టారు.


గౌతాపూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ మోహన్‌రావు

భూత్పూర్‌లో 75.8శాతం పోలింగ్

భూత్పూర్: మున్సిపాలిటీతో పాటు మండలంలోని 18 పంచాయతీల్లో 75.8శాతం పోలింగ్ అయినట్లు తహసీల్దార్ రాజు తెలిపారు. మున్సిపాలిటీలోని 9వ పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో ఉదయం 7:30 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది.

చిన్నచింతకుంట: మండలంలో 36 పోలింగ్ కేంద్రాల్లో 36,051ఓటర్లు ఉండగా 75 శాతం పోలింగ్ నమోదైంది. పర్దిపురం, లాల్‌కోట, నెల్లికొండి, సీతారాంపేట, పెద్దవడ్డేమాన్, దమగ్నాపురం, ఉంద్యాల, చిన్నచింతకుంట పోలింగ్ కేంద్రాలను ఐపీఎస్ ట్రైనర్ చిత్తరంజన్ పరిశీలించారు.

దేవరకద్రలో 71.55 శాతం పోలింగ్

దేవరకద్ర: నియోజకవర్గంలో 289 పోలింగ్ కేంద్రాలలో సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ముగిసింది. సాయంత్రం వరకు 71.55 శాతం పోలింగ్ జరిగింది. దేవరకద్ర మండలం 78.98, చిన్నచింతకుంట 72.89, కొత్తకోట 69.55, కౌకుంట్ల 69.50, మదనాపూర్ 73.65, భూత్పూర్ 72.73, మూసాపేట 71.15, అడ్డాకుల 73.58, మహబూబ్‌నగర్ రూరల్ 73.47గా పోలింగ్ శాతం నమోదైంది. దేవరకద్రలో పోలింగ్‌ను పరిశీలించడానికి సాయంత్రం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చేరుకుని బీఆర్‌ఎస్ నాయకులతో మాట్లాడారు. మండలంలో పోలింగ్ సరళిపై ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆరా తీశారు. ఆయన సాయంత్రం దేవరకద్ర ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి అక్కడ ఉన్న కాంగ్రెస్ నాయకులతో మాట్లాడారు.


మహబూబ్‌నగర్‌లో ఓటేసిన యువతి


పాలమూరులో స్లిప్పులు చూపిస్తున్న ఓటర్లు


నవాబుపేటలో వృద్ధురాలిని తీసుకొస్తున్న వలంటీర్లు

అడ్డాకులలో 75.87శాతం

అడ్డాకుల: మండల వ్యాప్తంగా 75.87 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్ తెలిపారు. మండల వ్యాప్తంగా 20,331 మంది ఓటర్లకు గాను 15,426 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మూసాపేట మండలంలో 73.53శాతం పోలింగ్ నమోదైంది. మండల వ్యాప్తంగా 19,945 ఓట్లుండగా 14,666 పోలయ్యాయి. పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వేర్వురుగా సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. నిజాలాపూర్‌లో ఓటర్లు పెద్ద సంఖ్యలో వరుస కట్టారు.


ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు

గండేడ్‌లో 59.45 శాతం..

గండేడ్: మండలంలో 27 పంచాయతీల్లో ఉండగా 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని గ్రామాల్లో కలిపి 59.45 శాతం పోలింగ్ నమోదైంది. గండేడ్, పగిడ్యాల్, వెన్నాచేడ్ గ్రామాల్లోని బూత్‌లలో ఓటర్లు బారులు తీరారు. చిన్నవార్వాల్‌లో చిన్నపాటి ఘర్షణ జరిగింది. సహాయకులుగా వచ్చిన వారు ఓటేసే దగ్గరకు వెళ్లి ఎలా చూస్తారని ఓ పార్టీకి చెందిన ఏజెంట్ పోలింగ్ ఆపాలని గొడవకు దిగాడు. దీంతో మరోపార్టీకి చెందిన ఏజెంట్ దీన్ని చిత్రీకరిస్తుండగా ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు జోక్యం చేసుకొని గొడవ సద్దుమణిగేలా చేశారు. రంగారెడ్డిపల్లి 64వ బూత్‌లో ఉదయం 10 గంటల ప్రాంతంలో ఈవీఎం మోరాయించింది. మహబూబ్‌నగర్ డీఎస్పీ సుదర్శన్, ఎస్ఐ శేఖర్ రెడ్డి పర్యవేక్షించారు.


పగిద్యాలలో ఓటు వేసేందుకు నిల్చున్న ఓటర్లు


రాజాపూర్‌లో మోడల్ పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న తహసీల్దార్

పోలింగ్ సరళి సాగిందిలా..


ప్రేమ్‌నగర్ పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితాలో పేర్లు చూస్తున్న ఓటర్లు

- అత్యధికంగా షాద్‌నగర్ అసెంబ్లీలో 72.42శాతం
- అత్యల్పంగా మహబూబ్‌నగర్ అసెంబ్లీలో 63.26శాతం

పాలమూరు: జిల్లాలో సోమవారం మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగాయి. మొత్తం ఏడు నియోజకవర్గాల్లో ఉన్న 1,937 పోలింగ్ కేంద్రాల్లో సజావుగా సాగింది. ఉదయం 7గంటల నుంచి ప్రారంభమైన ఓటింగ్ విధానం సాయంత్రం 6గంటల వరకు కొనసాగింది. ప్రధానంగా మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న 275 కేంద్రాల్లో మొదట మందకొడిగా సాగిన పోలింగ్ క్రమంగా కొంత పుంజుకుంది. 2019 పార్లమెంట్ ఎన్నికలతో పోల్చితే ఈసారి జరిగిన ఎన్నికల్లో పోలింగ్ 3.02శాతం పెరిగింది. 2019లో 65.38శాతం నమోదు కాగా ఈ ఎన్నికల్లో సాయంత్రం 5గంటల వరకు 68.40శాతం నమోదైంది. సాయంత్రం 6గంటల తర్వాత పోలింగ్ కేంద్రాల్లో క్యూలైన్‌లలో ఉన్న వారు పూర్తిగా ఓటు హక్కు సద్వినియోగం చేసుకుంటే పోలింగ్ శాతం పెరిగేది.

బోసిపోయిన కేంద్రాలు

మహబూబ్‌నగర్ పట్టణంలో అతి పెద్ద పోలింగ్ కేంద్రాలయిన ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, మాడ్రన్ స్కూల్, పోలీస్ లైన్ స్కూల్, గాంధీ రోడ్ స్కూల్ ఉదయం 11గంటల వరకు బోసిపోయాయి. ఓటర్లు రాకపోవడంతో ఖాళీగా దర్శనం ఇచ్చాయి. అత్యధిక కేంద్రాల్లో క్యూలైన్‌లో కన్పించలేదు. చాలా కేంద్రాల్లో ఓటరు జాబితాలలో పేర్లు పరిశీలించే దగ్గర కొంత రద్దీ కన్పించింది.

- మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో సాయంత్రం 5గంటల వరకు నమోదు అయిన పోలింగ్ సరళిలో అత్యధికంగా షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 72.42శాతం నమోదు కాగా అత్యల్పంగా మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 63.26శాతం ఉంది. ప్రధానంగా పట్టణాల్లో ఉండే ఓటర్లు కొంత మేర తమ ఓటును సద్వినియోగం చేసుకోవడంలో ఆసక్తి చూపలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చిన పట్టణాల్లో ఉండే వారు ఇళ్లకు పరిమితమయ్యారు.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం (సాయంత్రం 5గంటల వరకు)

నియోజకవర్గం	9గం.	11గం.	1గం.	3గం.	5గం.
దేవరకద్ర	12.25	29.75	48.93	61.92	71.90
జడ్చర్ల	11.32	29.8	49.39	63.73	72.13
కొడంగల్	11.19	29.32	47.59	60.44	65.54
మహబూబ్‌నగర్	10.87	25.23	42.08	52.45	63.26
మక్తల్	8.07	25.11	43.78	59.43	67.61
నారాయణపేట	9.40	24.32	45.25	54.99	66.67
షాద్‌నగర్	9.25	25.69	44.03	60.26	72.42


జడ్చర్లలో ఓటేసిన మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


ఓటేసిన ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి జితేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు


ఓటు హక్కును వినియోగించుకున్న కొత్వాల్ తదితరులు

ప్రముఖుల సందడి

పాలమూరు జిల్లాలో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

- రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ కుటుంబసమేతంగా స్థానిక పద్మావతీకాలనీలోని 102 పోలింగ్‌బూత్‌లో ఓటేశారు. అదే విధంగా మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ దంపతులు స్థానిక టీకేరెడ్డికాలనీలోగల బీఫార్మసీ కళాశాలలోని 132 పోలింగ్‌బూత్‌లో ఓట్లు వేశారు.
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి దంపతులు జిల్లా కేంద్రం పద్మావతీకాలనీలో గల ప్రతిభ జూనియర్ కళాశాలలోని 103 పోలింగ్ బూత్‌లో ఓట్లు వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కును వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. అనంతరం ఎమ్మెల్యే న్యూప్రేమ్‌నగర్, గాంధీరోడ్డు పాఠశాల, రవీందర్‌నగర్, పాతపాలమూరు, టీకేరెడ్డికాలనీ, ఎంబీఎస్ జూనియర్ కళాశాల, టీచర్స్‌కాలనీ పార్క్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాల, డైట్ కళాశాల, శ్రీవాసవి డిగ్రీ కళాశాల, షాషాబ్‌గుట్ట ఉర్దూ మీడియం పాఠశాల, నలంద ఆటోస్టాండ్‌లోని కాకతీయ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సరళిని పరిశీలించారు.
- స్థానిక పద్మావతీకాలనీలోని పోలింగ్ కేంద్రం (113) లో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి జితేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీకేరెడ్డికాలనీలోని సరోజిని రాములమ్మ ఫార్మసీ కాలేజీలోని పోలింగ్ కేంద్రం 132లో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, ప్రసన్న దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తెలంగాణచౌరస్తాలోని టీఎన్‌జీఓల భవనంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి .వినోద్‌కుమార్ కుటుంబ సమేతంగా ఓటు వేశారు.
- బాలానగర్ మండలంలోని తిరుమలగిరిలో సింగరేణి సీఎండీ (ఐఆర్‌ఎస్) బల్‌రాంనాయక్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- జడ్చర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రంగారెడ్డిగూడలో ఓటు హక్కును వినియోగించుకోగా, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జడ్చర్ల పట్టణంలో ఓటు హక్కును వినియోగించకున్నారు.
- దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తన సతీమణితో కలిసి చిన్నచింతకుంట మండలం దమగ్నపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి క్యూలైన్‌లో నిలబడి ఓటు వేశారు. అలాగే దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- చిన్నచింతకుంటలో మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, పెద్దవడ్డేమాన్‌లో మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి తమ ఓటును వినియోగించుకున్నారు.
- నవాబుపేట మండలంలోని గురుకుంటలో ఎంఎస్ఎన్ ఫార్మ కంపెనీ అధినేత ఎం సత్యనారాయణరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటేయగా, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, ఎంపీ సోదరులు కుటుంబ సభ్యులతో కలిసి ఓటేశారు.


ఓటేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, కుటుంబ సభ్యులు


ఓటు వేసిన అనంతరం సిరా చూపుతున్న సింగరేణి సీఎండీ బల్‌రాంనాయక్


పెద్దవడ్డేమాన్‌లో ఓటేసిన మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి


అన్నాసాగర్‌లో ఓటు వేసి బయటకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు


గురుకుంటలో సిరా చుక్క చూపిస్తున్న ఎం.సత్యనారాయణ తదితరులు